ఇంకెన్నాళ్లీ తిప్పలు..?

ఏడేళ్లైనా బస్టాండ్ ఊసే లేదు
- ప్రమాదకరంగా రోడ్డుపైనే బస్సుల మలుపులు
- కండక్టర్, డ్రైవర్‌లకు ప్రతిరోజు తప్పని తిప్పలు


కండక్టర్లకు తప్పని ట్రాఫిక్ డ్యూటీ

చార్మినార్: ప్రధాన రోడ్డులో డ్రైవర్లతో పాటు కండక్టర్లకు ప్రతిరోజూ పరేషాన్ తప్పడం లేదు. ట్రిప్పు.. ట్రిప్పుకు రోడ్డుపైనే బస్సులను టర్నింగ్ చేయాల్సి వస్తోంది. ట్రాఫిక్ మధ్యలోంచే బస్సులను మలుపులు తిప్పుతున్నారు. దీంతో అప్పటి వరకు ప్రయాణికులకు టికెట్లు అందజేసిన కండక్టర్లు.. చార్మినార్ ఎండింగ్ పాయింట్‌కు వచ్చే సరికి ట్రాఫిక్ డ్యూటీ చేయాల్సి వస్తోంది. ప్రధాన రోడ్డుపై ఈ తంతు జరుగుతుండడంతో ఎక్కడి ట్రాఫిక్ అక్కడే కొద్ది సేపు నిలిచిపోతుంది. గత ఏడేళ్లుగా ఇదే తంతు జరుగుతోందిక్కడ. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కొనసాగిన బస్టాండ్‌ను కూల్చివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రయాణికులకు చార్మినార్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఎంతో సౌకర్యంగా ఉండేది. జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామంటూ ఇక్కడి పాత భవన సముదాయాన్ని 2018 జనవరి 24న కూల్చివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ ఎలాంటి నిర్మాణం జరగలేదు. ఈ స్థలంలో కొద్ది రోజులు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు అనంతరం నిలిపివేసి తాళం వేశారు.

30 ఏళ్ల క్రితం..

30 ఏళ్ల క్రితం చార్మినార్ బస్‌స్టేషన్ చార్మినార్ కట్టడం వద్ద కొనసాగింది. 1989లో సీపీపీ (చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్టు) పనుల కోసం చార్మినార్ కట్టడం వద్ద నుంచి ఆర్టీసీ బస్సులను పంచ్‌మోహల్లాలోని చార్మినార్ బస్‌స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ బస్సుల తరలింపునకు ముందు పంచ్‌మోహల్లా డిపో కొనసాగేది. ఆర్టీసీ బస్సులను చార్మినార్ కట్టడం నుంచి పంచ్‌మోహల్లాకు తరలించిన అధికారులు 2005లో ఇక్కడి నుంచి తరలించడానికి ప్రణాళికలు రూపొందించారు. చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను తరలిస్తామంటూ ముందుకు రావడంతో ఇక్కడి స్థానిక చిరు వ్యాపారులతో పాటు ప్రయాణికులు, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. 2006లో స్థానిక వ్యాపారులు, ప్రయాణికులు తమకు ఇక్కడే బస్టాండ్ ఉండాలంటూ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మానవ హక్కుల కమిషన్ 2007లో పంచ్‌మోహల్లాలోనే చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ కొనసాగాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా 2008లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సైతం చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఇక్కడి నుంచి తరలించొద్దంటూ ఆర్టీసీ అధికారులను కోరారు. దీంతో అప్పట్లో చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ తరలింపును విరమించుకున్నారు. కాగా, 2018 జనవరి 24న నుంచి పూర్తి స్థాయిలో భవనాన్ని తొలగించడంతో చార్మినార్‌లో ఆర్టీసీ బస్సులను నిలపడానికి ఎలాంటి బస్టాండ్ లేకుండా పోయింది.

ఏడేళ్లుగా బస్సులను రోడ్డు పైనే టర్న్ చేస్తున్న డ్రైవర్లు

చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ తొలగించి ఏడేళ్లు గడిచిపోయినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ కోసం అంటూ కూల్చివేతలు చేపట్టిన సంబంధిత అధికారులు ఏళ్లకు ఏళ్లు గడిచిపోతున్నా పూర్తిస్థాయిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. చార్మినార్ ప్రధాన రోడ్డుపైనే ఒక వైపు బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేసి 'చల్తీ కా నామ్ గాడీ' అన్నట్లు బస్సులను నడుపుతున్నారు. ఆర్టీసీ బస్సులు తిరగడానికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు మధ్యలోనే బస్సులను తిప్పుతున్నారు డ్రైవర్లు. దీంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.


ప్రమాదకరంగా నడిరోడ్డుపైనే మలుపు తిరుగుతున్న ఆర్టీసీ బస్సు

క్లుప్తంగా...

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వీవీపీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బాబురావు, హోంగార్డ్ నజీముద్దీన్ మాట్లాడుతూ..18 ఏళ్ల లోపు మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండా వాహనాలు రోడ్ల పైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల ఎండీ ముజుతబా ఖాన్, రిలేషన్‌షిప్ మేనేజర్ అజ్మత్, హైస్కూల్ ఇన్‌చార్జి గౌస్‌పాషా, అడ్మిన్‌లు అఫ్సా, రహీలా పాల్గొన్నారు.

సావర్కర్ జీవితం యువతకు ఆదర్శం


వీర్ సావర్కర్ మెమెంటోను మనీష్‌కు అందజేస్తున్న జొన్నకుంటి మధుసూదన్

గోల్కొండ: వీర్ సావర్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని బీజేపీ నాయకుడు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్వాన్ నియోజకవర్గం ప్రతినిధి జొన్నకుంటి మధుసూదన్ అన్నారు. కార్వాన్‌లో యువనాయకుడిగా సేవలు అందిస్తున్న మనీష్ టోరాట్‌ను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు వీర్ సావర్కర్ మెమెంటోను అందజేశారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు, బీజేపీ, బీజేవైఎం, నాయకులు, కార్యకర్తల కారణంగానే వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా ముగిశాయన్నారు. మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి కార్వాన్‌లో బేబీపాండ్స్ బల్దియా వారు ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా నిమజ్జనం ఊరేగింపులో తామంతా పోలీసులకు, మండపాల నిర్వాహకులకు సహకారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు తదితరులున్నారు.

షేక్‌పేట్‌లో భాగవత సప్తాహ ప్రవచనం


మాట్లాడుతున్న సముద్రాల శఠగోపాచార్యులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ నిర్వహణలో భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వ్యాసరచయిత సముద్రాల శఠగోపాచార్యులు ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవచిస్తు భక్తితో భాగవతాన్ని ఏడు రోజులు వింటే లెక్కలేనన్ని శుభాలు కలుగుతాయన్నారు. సుఖసంతోషాలు దక్కుతాయని సకల దోషాలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమాన్ని భూ విజన్ పక్షపత్రిక వ్యవస్థాపకులు దేవులపల్లి వరప్రసాద్‌రావు ప్రారంభించారు. సభా ప్రార్థనగా పోతన భాగవతంలోని పద్యాలను రాగయుక్తంగా ఆయన ఆలపించి భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి అశోక్‌కుమార్, సభ్యులు శ్రీనివాసులు, అర్చకులు రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఇంటర్ కాలేజ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా 'సెయింట్ ఆన్స్'


ట్రోఫీలతో మహిళా కళాశాల టీం

గోల్కొండ: తమ విద్యార్థినులకు వారు ఇష్టపడే క్రీడాంశాల్లో అత్యాధునిక శిక్షణతో పాటు వసతులు కూడా కల్పిస్తున్నామని మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ అల్లం విజయరాణి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సెయింట్ ఆన్స్ బ్యాడ్మింటన్ టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా గెలుపొందిన టీంను ఆమె అభినందించారు. తమ కళాశాలకు చెందిన హాసిని, వై.మలిక్, రెహానా జబీన్, ప్రజ్ఞ, జాయిస్, శ్రేయలతో కూడిన బ్యాడ్మింటన్ టీం గ్రూప్ స్థాయిలో అజయంగా నిలిచి చివరకు ఫైనల్‌లో భవన్స్ మహిళా కళాశాల టీంను 2-0తో విజేతగా నిలిచిందని ఆమె అన్నారు.

ప్రధాన రహదారులన్నిటినీ సుందరీకరిస్తాం


నూతన లైటింగ్ సిస్టమ్ ప్రారంభోత్సవంలో కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నిటినీ సుందరీకరిస్తామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద రూ.42 లక్షలతో వేసిన డెకరేటివ్ స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెవన్ టూంబ్స్‌లోని కుతుబ్‌షాహీ సమాధుల సందర్శనకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారని సెవన్ టూంబ్స్ సమాధుల ప్రాంగణానికి ఆధునిక వీధిదీపాలు సరికొత్త సొబగులు అందిస్తాయన్నారు. అదే విధంగా గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకులు సైతం ఈ వీధి దీపాలు కనువిందు చేయడం ఖాయమన్నారు. సెవన్ టూంబ్స్ చౌరస్తా నుంచి గోల్కొండకు రోప్ వే నిర్మాణ ప్రతిపాదనకు నిధులు మంజూరయ్యాయన్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చొరవతో రోప్ వే ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అదే విధంగా గోల్కొండ కోటకు ఉన్న ఫతేదర్వాజా, మోతీదర్వాజా, మక్కైయి దర్వాజాల వద్ద కూడా సుందరీకరణ పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, మిర్జా ఎక్బాల్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న రాఘవేందర్, ఆలయ కమిటీ సభ్యులు

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక బడ్జెట్‌లో శాలిబండ చందూలాల్ బేలా కాశీవిశ్వనాథ్ స్వామి ఆలయ ప్రాంతాల్లో మంజూరైన సీసీ రోడ్డు పనులను మంగళవారం ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల ఉత్సవాల సందర్భంగా పాతబస్తీలోని వివిధ ఆలయాలకు కాశీ విశ్వనాథ్ స్వామి ఆలయం నుంచి పెద్ద ఎత్తున్న అమ్మవారి ఘటాలను తరలిస్తారన్నారు. గుంతలమయంగా మారిన ఈ ప్రాంతాల్లో నూతన రోడ్డు చేపట్టాలని కోరుతూ 2022లో హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అప్పటి జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్‌కు వినతిపత్రం ఇచ్చారన్నారు. ఇటీవల ముగిసిన బోనాల ఉత్సవాల సందర్భంగా అప్పుడు జోనల్ కమిషనర్‌గా ఉన్న వెంకన్నకు వివరించాగా వెంటనే స్పందించి సీసీ రోడ్డు పనులకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కన్న మాదన్న ఆలయ కమిటీ కార్యనిర్వాక కార్యదర్శి ఎస్.పి. క్రాంతికుమార్, సభ్యులు కృష్ణ, దినేష్, అనంద్, మహేష్, విశాల్, ముఖేష్, జితేందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అబిడ్స్: సరోజినీనాయుడు వనిత మహా విద్యాలయ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సరోజినీనాయుడు మహా విద్యాలయాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ విద్యార్థినుల కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. తరచు విద్యాలయాలతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా సామాజిక సేవా దృక్పథంతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవలందిస్తుందని మధుకర్ స్వామి పేర్కొన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రిజినల్ చైర్మన్ విద్యాభూషణ్, డాక్టర్ లక్ష్మీకుమారి, లయన్ రఘునాథ్‌రెడ్డి, వనిత మహా విద్యాలయ చైర్మన్ అశ్వక్ హైదర్, కార్యదర్శి ఏనుగుల రాజేందర్ ప్రిన్సిపాల్ రాధిక, ఎన్ఎస్ఎఫ్ యూనిట్ అధికారులు ఎ.సంధ్య, ఎం.నాగలక్ష్మీ, కె.లక్ష్మీలతో పాటు కిమ్స్ ఆసుపత్రి, గ్లోబల్ ఆసుపత్రి, సౌజన్య ఆసుపత్రి, యశోద ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న ఎన్ఎండీసీ అధికారులు

నాంపల్లి: ప్రభుత్వ రంగ సంస్థలు సామాజిక బాధ్యతతో అందించే సాయంతో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎన్ఎండీసీ ఉన్నత అధికారి శ్యామ్ పొట్టవర్తిని (జీఎం-సీఎస్ఆర్) అన్నారు. మాసబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 48 విద్యార్థులకు రూ.80 వేలతో కూడిన క్రీడా దుస్తులు, షూస్‌ను అందజేశారు. ప్రభుత్వ విద్యారంగ సంస్థల బలోపేతానికి ఎన్ఎండీసీ తనవంతు కృషి చేస్తుందని తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల క్రీడాభివృద్ధికి సహకరించిన ఎన్ఎండీసీ అధికారులకు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీ అధికారులు విజయ్‌చంద్ర (డీఎం-సీఎస్ఆర్), కామేశ్వరరావు (ఏజీఎం-సీఎస్ఆర్), సీనియర్ మేనేజర్ జైకుమార్, అధ్యాపకులు సుధీకర్‌కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

కమిషనర్ సీవీ.ఆనంద్‌కు సత్కారం


కమిషనర్‌ను సత్కరిస్తున్న అక్షయ్‌కుమార్

అబిడ్స్: నగర పోలీస్ కమిషనర్, డీజీ సీవీ ఆనంద్‌ను ఘనంగా సత్కరించారు. గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగినందుకు కమిషనర్ సీవీ ఆనంద్‌కు గోషామహల్ నియోజకవర్గానికి చెందిన అక్షయ్‌కుమార్‌తో పాటు నవీన్‌కుమార్, అక్రమ్, అంకిత్ సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అక్షయ్‌కుమార్ మాట్లాడుతూ..నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో చేపట్టడంలో పోలీస్ శాఖ చేపట్టిన కృషి అమోఘమని పేర్కొన్నారు.

శుభాకాంక్షలు



నాంపల్లి: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా, నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్‌కు చెందిన క్రాంతి నియమితులైన సందర్భంగా పలువురు బీజేపీ కార్యకర్తలు మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ నేతలు ఎం.రామ్‌దాస్, జి.అరవింద్, జగన్నాథరాజ్ తదితరులు ఉన్నారు.

పూలకు తగ్గిన గిరాకీ



గోల్కొండ: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో పూలకు గిరాకీ బాగా తగ్గింది. గుడిమల్కాపూర్‌లోని పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్ గత రెండు రోజుల నుంచి గిరాకీ లేక వెలవెలబోతోంది. 15 రోజులుగా పూల కొనుగోళ్లతో సందడిగా మారిన ఈ మార్కెట్ నేడు కొనుగోలుదారులు లేక బోసిపోయి మారింది. గిరాకీ లేక పూల వ్యాపారులు అమ్ముడుకాని పూలను మార్కెట్ వెనుకప్రాంతంలో పారబోస్తున్నారు.

అన్నదానం



అబిడ్స్: శ్రీ చెన్నకేశవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ వద్ద మార్కెట్‌లో పనిచేసే కూలీలు, స్థానికుల కోసం ఈ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాదాపు 200 మందికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా ట్రస్ట్ ప్రతినిధులు కాజా వెంకట వసంత, తులసి మాట్లాడుతూ..ప్రతి నెల తమ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజల ఆకలి తీర్చేందుకు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వి.తులసి, భారతి, సుధా, దివ్య, నేహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి స్నిగ్ధ మాధవికి సన్మానం


స్నిగ్ధ మాధవిని సన్మానిస్తున్న నాదేండ్ల భాస్కర్‌రావు

అఫ్జల్‌గంజ్: ప్రముఖ కవయిత్రి, రచయిత, ఉపాధ్యాయురాలు స్నిగ్ధ మాధవిని ఘనంగా సన్మానించారు. ధూల్‌పేట రహీంపురా పరిధిలోని నవభారత్ నిర్మాణ్ సంఘ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సన్మాన కార్యక్రమం చేపట్టారు. రచయిత్రి, కవయిత్రి, ఉపాధ్యాయురాలుగా విశేష సేవలందిస్తున్న స్నిగ్ధ మాధవిని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవులు, రచయితలు, ఉపాధ్యాయుల పాత్ర నవ సమాజ నిర్మాణంలో ఎంతో ముఖ్య ఘటమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా స్నిగ్ధ మాధవి విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నవభారత్ నిర్మాణ్ సంఘ్ అధ్యక్షులు, విద్యావేత్త సూరేపల్లి రవికుమార్ మాట్లాడుతూ..తమ సంఘ్ ఆధ్వర్యంలో స్నిగ్ధ మాధవి చేస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, ఉత్తమ కవయిత్రికిగా, ఉత్తమ రచయితగా సన్మానించి అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ జగదాంబనగర్‌లో నర్సింహా కుటుంబం నివాసం ఉంటుంది. వీరి రెండో కుమారుడు అభిషేక్ (28) డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి నిద్రలేని సమస్య కారణంగా వైద్య చికిత్సలు పొందుతున్నాడు. సోమవారం రాత్రి మొదటి అంతస్థులోని గదిలోకి వెళ్లిన అతను మంగళవారం ఉదయం ఎంతకు తలుపు తీయకపోవడంతో స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు తలుపు విరగొట్టి చూడగా అప్పటికే అభిషేక్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం

చార్మినార్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణ భాషా దినోత్సవం, ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ రెడ్డి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జోనల్ జాయింట్ కమిషనర్ డి. శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జోనల్ ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ సతీష్‌రెడ్డి, డీఈ సత్యనారాయణరెడ్డి, ఏఈ చరణ్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


నివాళులర్పిస్తున్న తాడబోయిన శ్రీనివాస్


వేడుకల్లో కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ వికాస్ చంద్ర తదితరులు


కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ చంద్రముఖర్జీ తదితరులు

సిటీ కళాశాలలో..

ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించిన తెలంగాణ భాషా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అదనపు కమిషనర్ డా.ఎన్.యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపిన సాహిత్య ఋషి కాళోజీ అని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విప్లవ దత్ శుక్లా, కోయి కోటేశ్వరరావు, కమల సుధారాణి, సుజాత, నీరజ, డా.అజ్మీరా సుజాత పాల్గొన్నారు.

సింగరేణి భవన్‌లో..

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. జనరల్ మేనేజర్, కో ఆర్డినేషన్ తాడబోయిన శ్రీనివాస్, సింగరేణి ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాకతీయ స్కూల్‌లో..

జియాగూడ: తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జియాగూడ కాకతీయ స్కూల్‌లో కాళోజీ జయంతి, సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వికాస్ చంద్ర మాట్లాడుతూ..కాళోజీ రచించిన రచనలు నేటికీ ప్రజాదరణ పొందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్స్ ప్రసన్నలత, సుమెదా, వందన, సరిత తదితరులు పాల్గొన్నారు.

శాలిబండలో..

గౌలిపురా: తెలంగాణలో అన్యాయాలపై ధిక్కార స్వరం కాళోజీ అని శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, బహదూర్‌పురా ఐఓఎస్ హరినారాయణ అన్నారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో కాళోజీ జయంతి, స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్, కాళోజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు అనురుద్దరావు, మధుసూదన రావు, డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, సంధ్య, అంజలి, మంజుల, శ్రీదేవి, ప్రేమిల, రవికాంత్ పాల్గొన్నారు.


కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జోనల్ కమిషనర్

ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో..

గన్‌ఫౌండ్రీ: నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ, మహబూబ్‌నగర్ ఎంవీఎస్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి, అరుణ్‌కుమార్, భీమమ్మ, డాక్టర్ సరిత, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఎల్బీస్టేడియంలో..

ఎల్బీస్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కాళోజీ జయంతిని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, సుజాత, పద్మావతి, ఇంజినీర్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు కేఆర్.భాట్రా, కల్యాణి పాల్గొన్నారు.